క్లుప్తంగా

విద్యుత్ లైన్ ఎత్తు పెంచడానికి చర్యలు



వేలాడుతున్న విద్యుత్‌లైన్ పరిశీలిస్తున్న ఏడీఈ రఘు

రొళ్ల: మండలంలో రొళ్ల, బీజీహళ్లి, రత్నగిరి విద్యుత్ సబ్ స్టేషన్ కేంద్రం నుంచి గ్రామాలకు లాగిన 11 కేవీ విద్యుత్ లైన్ ఎత్తును పెంచడానికి చర్యలు తీసుకుంటామని ఏడీఈ రఘు పేర్కొన్నారు. ఈనెల 26న నసేపల్లిగొల్లహట్టి గ్రామానికి చెందిన కాపరి మారన్న (33) అదే గ్రామం పొలిమేరలో 11 కేవీ తీగలు తగిలి మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఏడీఈ స్థానిక ఏఈ నిజాముద్దీన్‌తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఈ రఘు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల క్రితం లాగిన 11 కేవీ తీగలు కావడంతో కిందకు వేలాడుతున్నాయన్నారు. ప్రస్తుతం వర్షాకాలం భూమిలో తేమ శాతం ఎక్కువ ఉండటంతో విద్యుత్ తీగల వద్దకు వెళితే షాక్ గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. కొత్తగా లైన్ల ఎత్తును పెంచి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

31 నుంచి యోగాభ్యాసనంపై శిక్షణ

రొళ్ల: రత్నగిరి గ్రామంలో ఉన్న ఆర్డీటీ కమ్యూనిటీ భవనం ఆవరణలో ఈనెల 31 నుంచి వచ్చే నెల 17 వరకు రోజూ సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు ఉచితంగా యోగాభ్యాసనంపై శిక్షణ నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయుడు మహదేవప్ప గురువారం తెలిపారు. రత్నగిరి పంచాయతీలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోండి



నిర్వాహకులకు నిబంధనలు వివరిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

లేపాక్షి: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక విగ్రహాల నిర్వాహకులకు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వేడుకల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. విద్యుత్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, జనసమూహ నియంత్రణ, సురక్షితమైన నిమజ్జన పద్ధతులు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.


సమయపాలన పాటించాలి



పండ్ల మొక్క నాటి నీరు పోస్తున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

అగళి: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. గురువారం మండ కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు. మెనూ ప్రకారం అంగన్‌వాడీ చిన్నారులకు భోజనం అందించాలన్నారు. బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా ఆడబిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల లోపు వారి ఇంటిదగ్గర ఒక పండ్ల మొక్క నాటించాలన్నారు. అనంతరం అగళిలో ఆడపిల్ల పుట్టిన ఇంటి వద్ద పండ్ల మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

గుడిబండ: చిగతుర్పి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అశోక్ కుమార్ వివాహం కర్ణాటకలోని విదురాశ్వత్థంలో గురువారం జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సత్యకుమార్, సర్పంచ్ హనుమంతరాయప్ప, నాయకులు మల్లేష్, రంగనాథ్, చిత్తయ్య, నింగయ్య, కదురప్ప, రంగస్వామి పాల్గొన్నారు.



మడకశిరలో కొలువుదీరిన గణనాథుడు



మడకశిర: వేంకటరమణ స్వామి ఆలయం వద్ద..



మడకశిర: చావిడి వీధిలో కొలువుదీరిన వినాయకుడు



మడకశిర: షిరిడీ సాయి బాబా ఆలయ ఆవరణలో



పావగడలో కొలువైన వినాయకుడు



రొళ్ల మండలం టీడీ పల్లిలో కొలువుదీరిన గణనాథుడు



పెనుకొండ పట్టణంలోని అల్విన్ కాలనీలో నాయకుడు

మహాగణపతిం.. మనసాస్మరామీ..



సోమందేపల్లిలో కొలువుదీరిన వినాయకుడు



పరిగి మండలంలోని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ముందు విద్యార్థులు



హిందూపురం సడ్లపల్లిలో కొలువుదీరిన గణపయ్యను దర్శించుకొని పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేతలు

- గణనాథుడి నామస్మరణతో మార్మోగుతున్న మంటపాలు
- వీధివీధినా కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు

హిందూపురం: వినాయక చతుర్థిని పురస్కరించుకుని హిందూపురంలో వీధివీధినా గణనాథులు విభిన్న రూపాల్లో కొలువుదీరారు. హిందూపురం సుమారు 300 వరకు మంటపాలు ఏర్పాటు చేసి, వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు కొలువుదీర్చారు. ఎటుచూసినా మహాగణాధిపతిం..మనసాస్మరామీ అంటూ ప్రార్థిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు.పలుచోట్ల నిమజ్జనానికి నిర్వాహకులు సన్నహాలు చేస్తున్నారు. మరోవైపు మంటపాల నిర్వాహకులు పెద్ద ఎత్తున పూజలు చేస్తూ ప్రసాదాల పంపిణీ చేస్తున్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు..

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో బుధవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆలివ్స్‌కాలనీ, జీఐసీ కాలనీ, నారాయణమ్మ కాలనీ, న్యూకాలనీ, ఎగువగడ్డ, తోటగేరి, మారుతినగర్, బోయగేరి,అర్బన్ కాలనీ, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం, కొండాపురం, కోనాపురం, తిమ్మాపురం, మహదేవపల్లి, వెంకటాపురం తండా, పరమేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయా ప్రాంత వాసులు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధల మధ్య పూజలు నిర్వహించారు.

పెనుకొండ రూరల్: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని గ్రామ గ్రామాన ప్రజలు మండపాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించారు. భక్తి,శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

పరిగి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఆయా గ్రామ పెద్దలు, వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జనం నిర్వహించడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు.

రొద్దం: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. మండల కేంద్రంలోని పీర్ల చావిడిలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ అధ్వర్యంలో 21 అడుగుల మట్టితో ప్రత్యేకంగా తయారు చేసిన బొజ్జ గణపయ్యను ఏర్పాటు చేశారు. గిరీష్‌స్వామి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో పలు సాస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప, సింగిల్ విండో చైర్మన్ వీరాంజనేయులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. గ్రామాల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. గోరంట్లలోని వరసిద్ధి వినాయక దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా వినాయక చవితిను పురస్కరించుకుని గురువారం ఇళ్లతో పాటు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలని ఎస్‌ఐ రమేష్ బాబు సూచించారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి

చిలమత్తూరు: నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం గ్రామ గ్రామానా వినాయక విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం పలుచోట్ల వినాయక నిమజ్జనం చేశారు.



పెనుకొండలో తోటగేరిలో వినాయకుడు



పెనుకొండ మండలం గుట్టూరులో గణనాథుడు



అమరాపురం: పాత పోలీస్ స్టేషన్‌వద్ద పూజలు



సోమందేపల్లిలో కొలువుదీరిన వినాయకుడు



అమరాపురంలో అశ్వంపైన కూర్చొన్న హిందూ మహా గణపతి



సడ్లపల్లిలో ఏర్పాటు చేసిన విద్యాగణపతి పూజల్లో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డిని ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ



మడకశిర: కన్యకాపరమేశ్వరి ఆలయంలో కొలువుదీరిన వినాయకుడు



పెనుకొండలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యులు



పెనుకొండలోని ఎగువగడ్డలో గణపయ్య



రొద్దంలో 21 అడుగుల మట్టి వినాయక విగ్రహం



చెరువుకిందపల్లిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు

బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళి



బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ఉద్యమంలో అమరులకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ కో కన్వీనర్ రామకృష్ణ, నాయకులు రామాంజి, అంజినప్ప, జబీవుల్లా, గంగాధర్, సూరి, బాబురెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

సోమందేపల్లి: బషీర్ బాగ్ కాల్పుల్లో మృతి చెందిన అమర వీరుల చిత్ర పటాలకు సీపీఎం, సీపీఐ నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్మార్ట్ మీటర్లు, అదనపు చార్జీలతో కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోందని నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, మాబూ, లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు రాజ్ గోపాల్, బాలస్వామి, నారాయణ స్వామి, చాద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని మోదా గ్రామానికి చెందిన చైతేష్ ఉన్నత విద్యాభ్యాసం కోసం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మారుతీరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు చంద్ర ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన జయసింహ, సుశీలమ్మ దంపతుల కుమారుడు చైతేష్ ఇంటర్‌లో 1000కి 987 మార్కులు సాధించాడు. ఇటీవల నిర్వహించిన ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 4,003 ర్యాంకు సాధించి అమరావతిలోని విట్ కళాశాలలో ప్రభుత్వ సీటును ఉచితంగా సాధించాడు. అయితే హాస్టల్ వసతిని పొందేందుకు ఆర్థిక స్థోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో.. మారుతీరెడ్డి, బంగారుచంద్ర స్పందించారు. గురువారం ఉదయం చైతేష్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు రూ.50 వేల నగదును అందించి ఆర్థిక చేయూతనందించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, బాబుప్రసాద్, సంజీవమూర్తి, అశోక్, ధృవ, జగ్గు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై సైకో దాడి

హిందూపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం లోకేష్ అనే సైకో దాడి చేసినట్లు ఆర్టీసీ డ్రైవర్ ఎస్‌బీ నాయక్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ విధులు ముగించుకొని బస్సు కోసం వేచి ఉండగా, బస్టాండ్ వద్ద సైకో ఓ మహిళ వద్దకు వచ్చి డబ్బులివ్వాలని అడిగాడు. ఆమె తన వద్ద లేదని చెప్పడంతో ఘర్షణ పడ్డాడు. వారించిన డ్రైవర్‌పై దాడి చేశాడు. ముఖంపై రక్త గాయాలయినట్లు బాధితుడు తెలిపాడు. డయల్ 100 సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని సైకోను స్టేషన్‌కు తీసుకెళ్లారు.

న్యాయవాదిపై కేసు అన్యాయం



ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

పావగడ: న్యాయస్థానాల్లో వాదోపవాదాలు విన్న తర్వాతే న్యాయమూర్తి తీర్పు ఇస్తారని, అయితే పోలీసులు వాకింగ్ సమయంలోనూ బాధితులకు న్యాయం చేసే అవకాశం ఉందని స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్ తెలిపారు. అయితే స్థానిక న్యాయవాది సుధాకర్‌ను చుట్టుముట్టి సుమారు 20 మంది గొల్లరహట్టి గ్రామస్తులు అతనిపై తీవ్రంగా దాడి చేసి గాయపరచిన సంఘటనలో స్థానిక పోలీసులు మాత్రం నిందితులను వదిలేసి బాధిత న్యాయవాది సుధాకర్‌పై కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. ఇలాంటి ఘటనలతో పోలీసు వ్యవస్థపై నమ్మకం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే న్యాయవాది సుధాకర్ పై దాడి చేసిన బాధితుడు ఫిర్యాదు చేసిన 15 మంది నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు. అంతకు ముందు న్యాయవాదులు పెద్ద ఎత్తున ర్యాలీ చేసి, తాలూకా కార్యాలయం ఎదుట రాస్తా రోకో నిర్వహించారు.

ఘనంగా మంగళగౌరి ఊరేగింపు

మడకశిర: పట్టణంలో మంగళస్వర్ణ గౌరిని ఊరేగించారు. ముఖ్యంగా బ్రాహ్మణ, లింగాయత్, వైశ్య వర్గాలకు చెందిన మహిళలు మట్టి, పంచలోహాలతో తయారు చేసిన మంగళగౌరి ప్రతిమలను ఆలయాల్లో, ఇళ్లల్లో ఏర్పాటు చేసి మంగళ గౌరి వ్రతం నిర్వహించారు. గురువారం కన్యాకాపరమేశ్వర ఆలయంలో మాహిళా సంఘం ఆధ్వర్యంలో స్వర్ణగౌరికి ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

మడకశిర: మడకశిర ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత సికిందర్‌ను గురువారం పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప పరామర్శించారు. భూ తగాదా విషయంలో బుధవారం తన స్వగ్రామమైన ఈ.రంగాపురంలో జరిగిన ఘర్షణలో సికిందర్ గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయన మడకశిర ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఈరలక్కప్ప ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. నాయకులు అశ్వత్థనారాయణ, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

గుడిబండ: కురబరపల్లి గ్రామానికి చెందిన నవీన్ కుమార్ (33) కడుపునొప్పి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నవీన్‌కుమార్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. జీవితంపై విరక్తి చెంది మల్బరీ పంటకు ఉపయోగించే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప నవీన్ కుమార్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

అక్రమాలను వెలుగులోకి తెస్తారని దాడులు చేయిస్తారా?



చిలమత్తూరు పార్టీ కార్యాలయంలో ఎంపీపీతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేతలు

చిలమత్తూరు: అక్రమాలను వెలుగులోకి తెస్తున్నారని దాడులు చేసి చంపాలని చూడటం దుర్మార్గం అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బాలాజీ మనోహర్ అన్నారు. ఈ మేరకు చిలమత్తూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు బాలాజీ మనోహర్, అమానుల్లా, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు టీడీపీ మూకల దాడిలో గాయపడి కోలుకున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీపై జరిగిన దాడిని వారు ఖండించారు. బాలాజీ మనోహర్ మాట్లాడుతూ టీడీపీ నేతలు అధికారాన్ని అడ్డంపెట్టుకొని దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, కక్షలు, కార్పణ్యాలు పెంచుతున్నారని, అవి మంచిదికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి మంచివికాదన్నారు. ఇకనైనా ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా కాకుండా అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

పులమతి పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

లేపాక్షి: మండలంలోని పులమతి జెడ్పీహెచ్ఎస్‌కు జిల్లా స్థాయి స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికై ందని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌బాబు గురువారం తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా ఈనెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. పులమతి పాఠశాల వరుసగా నాల్గోసారి 2024–2025 సంవత్సరం క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ ఆధారంగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి రెండో స్థానంలో నిలిచిందన్నారు. వరుసగా నాల్గోసారి అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు.



అవార్డుకు ఎంపికైన పులమతి జెడ్పీ పాఠశాల

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఏపీటీఎఫ్ కమిటీ సభ్యులు, నాయకులు

రొద్దం: ఏపీటీఎఫ్ మండల కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని తురకలాపట్నం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి కొండూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా ఎం ఫణీంద్ర, అధ్యక్షుడిగా ఎస్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి, ఆడిట్ కమిటీ, జిల్లా, మండల కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బొలెరో



బోల్తాపడిన వాహనం

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డుపై బుధవారం రాత్రి ఓ బొలెరో వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈక్రమంలో వాహనం అదుపు తప్పి పక్కలో ఉన్న గుంతలోకి బోల్తా పడింది. ఇదిలా ఉండగా వేగంగా వచ్చి వాహనం ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం పాక్షికంగా దెబ్బతింది. అదే విధంగా వాహనం ముందు భాగం కూడా దెబ్బతింది. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: విద్యాశాఖలో పని చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్ నందిని, పీటీఐ పాండు, సీఆర్ఎంటీ రేణుకలు జిల్లా స్థాయిలో సమగ్ర శిక్ష ఉత్తమ ఉద్యోగులుగా ఆగస్టు 15న అవార్డు అందుకున్నారు. వీరిని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీలు గురువారం సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు పాంచజన్య శ్రీనివాసులు, ఆల్‌అమీన్ రియాజ్, వేణు, ముస్తఫాలు, సీఆర్ఎంటీలు, పీటీఐలు, భవిత కేంద్రం సిబ్బంది సన్మానించారు.